ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


కొలన్ హన్మంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని దుండిగల్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న వీర హనుమాన్ కాలనీవాసులు బాచుపల్లిలోని కార్యాలయంలో ఆయనను ఆదివారం మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి రోడ్డు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, అవసరమైతే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. వీర హనుమాన్ కాలనీకి వెళ్లి నివేదిక రూపొందించాలని సూచించారు. మాజీ టీపీసీసీ జాయింట్ సెక్రటరీ పోలీస్ జితేందర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బెంబిడి మల్లారెడ్డి, మాజీ కౌన్సిలర్ సురేశ్ బాబు, కాలనీవాసులు కట్టా మహాలక్ష్మి, సాయిరాం, రమేశ్, బట్టు విక్రం, సురేశ్ బాబు తదితరులు ఉన్నారు.

కుమారుల వేధింపుల నుంచి కాపాడండి


మేడ్చల్ జిల్లా హెచ్‌ఆర్‌సీఐ వైస్‌ప్రెసిడెంట్ మౌనికకు వినతి పత్రం ఇస్తున్న శంకరయ్య

దుండిగల్: ఆస్తి కోసం కుమారులు వేధిస్తున్నారని, వారి బారి నుంచి కాపాడాలని కోరుతూ ఓ వృద్ధుడు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ప్రతినిధులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళ్తే.. దుండిగల్‌కు చెందిన వృద్ధుడు కొత్తపేట శంకరయ్య (94)కు మల్లేశ్, నగేశ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. వయో భారంతో ఇంటి వద్దే ఉంటున్న శంకరయ్య, అతని భార్యను వేధింపులకు గురి చేస్తున్నారు. తన ఆస్తిని తీసుకున్న కుమారులు హత్య చేసేందుకు యత్నించారని, తిండి పెట్టకుండా చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ మేడ్చల్ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మౌనికను ఆదివారం కలిసి విన్నవించారు. స్పందించిన మౌనిక ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు షురూ


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం వద్ద స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులను ఆదివారం చేపట్టారు. ఇటీవల రూ.1.26 కోట్లతో రోడ్డు విస్తరణతో పాటు కల్వర్టు పనులు పూర్తిచేశారు. అయితే కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ సమీపంలోని రోడ్డుపై నాలుగైదు విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. దీంతో సర్కిల్ ఎలక్ట్రికల్ అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్ క్రేన్‌తో స్తంభాల షిఫ్టింగ్ పనులు చేపట్టాడు. రెండు రోజుల్లో మొత్తం స్తంభాలను రోడ్డు పక్కకు షిఫ్ట్ చేసి రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీగణేశ్ 'సాక్షి'కి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు


రోగులను పరీక్షిస్తున్న పారమిత హాస్పిటల్ వైద్యులు


పరీక్షలు చేయించుకుంటున్న మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: పద్మానగర్ ఫేజ్-1 కల్యాణ తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో చింతల్ పారమిత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన శిబిరంలో పీడియాట్రిక్, గైనిక్, కార్డియాక్, న్యూరో, ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, కార్యదర్శి దేవేందర్ రెడ్డి, ఆలయ అధ్యక్షుడు వినోద్ కుమార్, కాలనీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సత్యం, ప్రసాద్, కృష్ణారావు, రంగ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


లూయిస్ బ్రెయిలీ భవనంలో..

సుభాష్‌నగర్: సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవనంలో కేకే రెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించగా 200 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు కిశోర్‌కుమార్ రెడ్డి, ధనలక్ష్మి ఆధ్వర్యంలో పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజెబుల్డ్ అధ్యక్షుడు అంజయ్యగౌడ్, సభ్యులు నరేందర్‌రెడ్డి, యాదయ్య, శేఖర్‌గౌడ్, రాజ్‌కుమార్, ఆంజనేయులు, దేవి, శిరీష, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

జాతరకు చిత్తారమ్మ ఆలయం ముస్తాబు



సుభాష్‌నగర్: నగరంలో ఉజ్జయిని మహంకాళి జాతర తర్వాత అతిపెద్ద జాతర గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి జాతర పేరుగాంచింది. యేటా జనవరిలో జాతరను వైభవంగా నిర్వహిస్తుంటారు. వచ్చే జనవరి 19న జరిగే జాతరకు ఆలయ కమిటీ సభ్యులు ఇప్పటికే పనులు చేపట్టారు. తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక చిత్రకారులు వారం రోజులుగా వివిధ రంగులతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ మాట్లాడుతూ యేటా పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.


ఆలయంలోని అమ్మవారు


ఆలయం బయట రంగులు వేస్తున్న దృశ్యం

వన భోజనాల సందడి

కార్తీక మాసం సందర్భంగా ఆయా కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహణ


హెచ్‌ఎంటీకాలనీలో కాపు సంఘం వనభోజనాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

చింతల్: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం వివిధ కులసంఘాలు ఏర్పాటు చేసిన వనభోజనాలతో చింతల్ డివిజన్ హెచ్‌ఎంటీ కాలనీ సందడిగా మారింది. కుత్బుల్లాపూర్ కాపు సేవా సమితి (రిజిస్టర్డ్)ఆధ్వర్యంలో హెచ్‌ఎంటీ కాలనీలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో జరిగిన 27వ వనభోజన మహోత్సవానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సూరారం ప్రాంతంలో 266 చదరపు గజాల స్థలాన్ని కాపు సేవా సమితి సంఘ భవనానికి కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత డైరెక్టర్ పరసా పరమేశ్వర్ రావు, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిర్యాల రాఘవరావు, హైకోర్టు అడ్వకేట్ సుంకరి దిలీప్, తెలంగాణ కాపునాడు అధ్యక్షుడు, దేవాదాయ శాఖ ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంధం కరుణాకర్ నాయుడు, డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్, అడపా భాస్కరరావు, కుత్బుల్లాపూర్ కాపు సేవా సమితి ప్రతినిధులు పక్కాల దుర్గారావు, గౌరిశెట్టి శివఈశ్వర్ రావు, కోనేటి సత్యనారాయణ, సత్తి ఏసుబాబు, పాలపర్తి రామచంద్రరావు, పసుపులేటి సత్యనారాయణ, అచ్యుత సుబ్రమణ్యం, తెలుగశెట్టి బాల పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే

హెచ్‌ఎంటీ కాలనీలోని నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనంలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులస్తులకు అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. ముదిరాజ్ కుల సంఘం సభ్యులు సారాశంకర్ ముదిరాజ్, కుమారస్వామి ముదిరాజ్, రామకృష్ణముదిరాజ్, జింకల వెంకటేశ్ ముదిరాజ్ వేణు, కోడి ఆదిత్య ముదిరాజ్ పాల్గొన్నారు.

- గాజులరామారం డివిజన్ పరిధి నల్లగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో భట్రాజు సంఘం మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ శాఖల ఆధ్వర్యంలో 21 వ వనభోజన వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ పరిచయ వేదికతో పాటు మహిళలకు పలు క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి కరుణాకర్ రాజు, విద్యా ఉపాధి కమిటీ చైర్మన్ కేశిపెద్ది నరసింహారాజు, వ్యవసాయ యూనివర్సిటీ సైంటిస్ట్ దామోదర్ రాజు, భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు, మహిళా ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం సావిత్రి, యువజన విభాగం అధ్యక్షుడు కూరపాటి నరసింహారాజు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లోలబట్టు కృష్ణంరాజు పాల్గొన్నారు.

గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో..

- హెచ్‌ఎంటీ కాలనీలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో గోకుల యాదవుల కార్తీక వనభోజనాలు సందడిగా జరిగాయి. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎల్.వెంకట్రావు యాదవ్, గౌరవ అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్, గౌరవ సలహాదారులు వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి తిరుమలరాజ్‌యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుక్కల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ప్రగతినగర్‌లో శెట్టిబలిజ సంఘం..

నిజాంపేట్: నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప శెట్టిబలిజ సంఘం కార్తీక వనభోజనాలు ప్రగతినగర్ సింహపరికాలనీలో ఘనంగా జరిగాయి. కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా భోజనాలతో పాటు పలు సంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డితో పాటు శెట్టిబలిజ సంఘం నాయకులు పితాని శ్రీనివాస్‌రావు, పాటి నాగవెంకటరమణ, జగత్తు సత్యప్రసాద్, వేంద్ర జనార్దన్ రావు, రాయుడు దుర్గారావు పాల్గొన్నారు.


నల్లగుట్ల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే వివేకానంద్..


శెట్టిబలిజ వనభోజనాలకు హాజరైన కొలన్ హన్మంతరెడ్డి

రియాక్టర్ పేలిన ఘటనలో మరో కార్మికుడి మృతి

జీడిమెట్ల: అరోర్ ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈనెల 20న జీడిమెట్ల ఫేస్-4లోని అరోర్ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో అనంతపూర్ జిల్లా గుత్తికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్ అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా గోపిచంద్, శ్రీనివాస్‌రెడ్డి, సూరారంలోని జీవన్ జ్యోతినగర్‌కు చెందిన బలరాం (51) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పరిశ్రమ యాజమాన్యం అమీర్‌పేటలోని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించింది. అక్కడే చికిత్స పొందుతున్న బలరాం పరిస్థితి విషమించి శనివారం రాత్రి 10 గంటలకు మృతిచెందాడు. కాగా బలరాం మూడేళ్లుగా అరోర్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందేలా సదరు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని బంధువులు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!


సూరారం ప్రధాన రోడ్డు మల్లారెడ్డి ఆసుపత్రి ఎదుట మ్యాన్‌హోల్ పరిస్థితి

సుభాష్‌నగర్: నర్సాపూర్ రాష్ట్ర రహదారి సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి ఎదుట ప్రధాన రోడ్డుపై మ్యాన్ హోల్ పైకప్పు విరిగింది. దీంతో గమనించని పలువురు వాహనాదారులు అందులో పడి గాయాల పాలవుతున్నారు. స్థానికంగా ఉన్న దుకాణ యజమానులు ప్రమాదాలు జరగకుండా కర్రను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ వాహనాలు తట్టుకునేలా మ్యాన్‌హోల్ పైకప్పులు ఏర్పాటు చేయాని స్థానికులు కోరుతున్నారు.

పడిపూజలో ఎమ్మెల్సీ కవిత

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కుందనపల్లి ప్రజాసాయిగార్డెన్‌లో నివాసం ఉంటున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జాగృతి నాయకుడు విజయేందర్ గురుస్వామి ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలకు

డబ్బులు అందేనా..?

- పెద్ద ఎత్తున పేరుకుపోయిన బకాయిలు
- ఈ విద్యా సంవత్సరంలో దుస్తులు కుట్టి ఇచ్చిన మహిళా సంఘాలు
- 507 ప్రభుత్వ బడుల్లోని 89,565 మంది విద్యార్థులకు దుస్తుల పంపిణీ
- పాఠశాలల ప్రారంభంలోనే యూనిఫామ్‌ల అందజేత

సాక్షి,సిటీబ్యూరో: ఏక రూప దుస్తులు కుట్టిన మహిళా సంఘాల సభ్యులకు నెలలు గడిచినా కూలి డబ్బులు చెల్లించకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఉరుకులు, పరుగులతో రాత్రింబవళ్లు శ్రమించి సకాలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) అందించామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని జిల్లాలకు ప్రభుత్వం సరఫరా చేసింది. అలాగే, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులకు విద్యార్థుల ఏక రూప దుస్తులు కుట్టించే బాధ్యతను అప్పగించారు. విద్యార్థుల ఏకరూప దుస్తులు మహిళా సంఘాల సభ్యులు కుట్టేలా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకోగా, వారు రాత్రింబవళ్లు కష్టపడి సకాలంలో పూర్తి చేశారు. దుస్తులు కుట్టి నెలలు గడిచినా ఇప్పటి వరకు కూలి డబ్బులు చెల్లించకపోవటంతో మహిళా సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

23 కుట్టు సెంటర్లు.. 1200 మంది మహిళలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 89,565 మంది విద్యార్థులకు రెండు జతలు ఏకరూప దుస్తులు కుట్టించేందుకు సరిపడు వస్త్రాన్ని ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ దుస్తులను సకాలంలో కుట్టేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వివిధ ప్రాంతాల్లో 23 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దుస్తులను కుట్టేందుకు ప్రభుత్వం తక్కువ ధర (కూలి) నిర్ణయించటంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మహిళా సంఘాలకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఏకరూప దుస్తులు కుట్టేందుకు 23 కేంద్రాల్లో 1200 మంది మహిళలు ముందుకు వచ్చి.. లక్ష్యానికి అనుగుణంగా ఏకరూప దుస్తులు కుట్టారు. ఒక్కొక్క జతకు మహిళా సంఘాలు (కేంద్రం నిర్వాహకులు) రూ.50లు, రాష్ట్ర ప్రభుత్వ తరపున రూ.25లు కలిపి మొత్తంగా రూ.75 చెల్లించాల్సి ఉంది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వరంలో మొదటి విడతగా ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలకు ఇప్పటి వరకు రూ.44,39,550 మాత్రమే చెల్లించారు.

సకాలంలో డబ్బులు అందక..

ఆర్థిక సాధికారత పొందేలా విద్యార్థులకు యూనిఫాం కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించినా, ప్రభుత్వం వారికి కూలి డబ్బులను సకాలంలో చెల్లించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏకరూప దుస్తుల(యూనిఫామ్) కూలి డబ్బులకు సంబంధించి మహిళా సభ్యులకు ఇంకా బకాయిలు రూ.88,55,700 చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సర్కారు దుస్తులను పంపిణీ చేస్తుండగా, వాటిని కుట్టే బాధ్యతలను మహిళా సభ్యులకు అప్పగించారు. జిల్లాలోని 507 ప్రభుత్వ పాఠశాలల్లో 89,565 విద్యార్థులు చదువుతుండగా, ఇందులో బాలురు 44,184 మంది బాలికలు 45,381 మంది ఉన్నారు. విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన క్లాత్‌ను (వస్త్రాన్ని)ప్రభుత్వం కొనుగోలు చేయగా, టెస్కో ద్వారా మహిళా సంఘాలకు సరఫరా చేశారు. విద్యార్థులకు సరిపడు క్లాత్ 1,81,719 మీటర్లు 144 మహిళా సంఘాల్లో టైలర్ పని చేసే 1200 మంది మహిళా సభ్యులకు అందజేయగా, వారు కుట్టారు.

మహిళలు కుట్టిన డ్రెస్ డిజైన్ ఇలా..

ఒకటి నుంచి మూడో తరగతి వరకు బాలికలకు ఫ్రాక్‌తో కూడిన యూనిఫామ్, 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, 6 నుంచి 10 తరగతి చదువుతున్న బాలికలకు పంజాబీ డ్రెస్‌తోపాటు వాస్కోటును ఆకర్షణీయంగా మహిళా సభ్యులు డిజైన్ చేసి కుట్టారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న బాలురకు రెడ్, యాష్ కలర్ చెక్స్ ప్రింటింగ్ షర్ట్, మెరూన్ కలర్ నిక్కర్, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలురకు షర్ట్, ప్యాంటు అందించారు.

నేడు స్వామివారికి భస్మాభిషేకం

మోతీనగర్: కార్తీక మాసం సందర్భంగా వీ రామారావునగర్‌లోని శ్రీ వినాయక శివపార్వతుల ప్రసన్నాంజనేయ నవగ్రహ నాగదేవత ఆలయంలో ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు స్వామివారికి భస్మాభిషేకం నిర్వహించనున్నట్లు పురోహితుడు శ్రీకాంత్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

పార్కులో నీటి సౌకర్యం


బోరు వేయిస్తున్న దృశ్యం

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో పార్కులో నీళ్లు లేక చెట్లు ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని కాలనీ ప్రెసిడెంట్ టీటీకే శ్రీనివాస్ డివిజన్ కార్పొరేటర్ హేమలతా సురేశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె ఆదివారం ఉదయం పార్కులో బోరు వేయించారు. ఆయన వెంట కాలనీ అసోసియేషన్ సభ్యులు, నాగిళ్ల నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి, పూర్ణచందర్ గుప్తా, విజయ భాస్కర్ రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపక్కనే చెత్తాచెదారం డంప్..!



జీడిమెట్ల: జీడిమెట్ల ఏస్వీ కోఆపరేటివ్ సొసైటీలోని రోడ్లపై బహిరంగంగానే చెత్తను వేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీడిమెట్ల టీఎస్ఐఐసీ అధికారులు స్పందించి రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజాంపేట్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని బాచుపల్లి మండల సీపీఎం కార్యదర్శి వెంకటరామయ్య అన్నారు. డిసెంబర్ 7,8 తేదీల్లో ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మేడ్చల్ జిల్లా సీపీఎం మూడో మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటోలకు పోస్టర్‌ను అంటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే సభలకు కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానికంగా శ్మశాన వాటిక అభివృద్ధి, కలుషితంగా మారిన చెరువుల సుందరీకరణ, మౌలిక సదుపాయాల కల్పన తదితర సమస్యలపై పోరాడుతామన్నారు. నాయకులు చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, సుధాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చింతల్: లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఈ లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వండర్ ప్లాస్టిక్స్ ఫీడర్ పరిధిలో ఎస్‌వీసీఐఈ, సాక్షి ప్రింటింగ్ ప్రెస్, వండర్ ప్లాస్టిక్స్, జయదుర్గ స్టీల్, రెడ్డి స్టీల్, హెచ్‌పీ పెట్రోల్ పంప్ తదితర ప్రాంతాలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శివాలయం ఫీడర్ పరిధిలో ఐడీపీఎల్, ఎస్ఎస్ బాలనగర్, శివాలయం రోడ్డు, రైల్వే కాలనీ గేట్, హనుమాన్ టెంపుల్ ఏరియా, సంపత్‌నగర్, కేతన్ స్టీల్ ట్రేడర్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నిజాంపేట్ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ తెలిపారు. 11కేవీ నిజాంపేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బాచుపల్లి గ్రామం, నిజాంపేట్ రోడ్డు, శిఖర హిల్స్, శ్రీనివాసా లేక్‌వ్యూ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ తెలిపారు. 11కేవీ మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవెన్ ఎన్‌క్లేవ్, వోక్షిత్ ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్, దేవభూమినగర్, ఆదర్శనగర్, మెట్‌కానిగూడ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెద్దమ్మనగర్, కృష్ణమహాలక్ష్మీనగర్, శారదా కాలనీ, ఎలగెన్స్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'మహా' గెలుపుపై బీజేపీ శ్రేణుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న నాయకులు

మోతీనగర్: మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే గెలుపొందడంపై బీజేపీ సీనియర్ నాయకుడు నార్లపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్‌లోని శ్రీ వివేకానందనగర్ చౌరస్తాలో పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణనూ బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే బీజేపీకి ప్రజలు పట్టం కడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి గోనెల సుందర్శన్‌ముదిరాజ్, మాజీ కార్యదర్శి సీహెచ్ వెంకటరామిరెడ్డి, అల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బందు హరికృష్ణ, బూత్ అధ్యక్షుడు వెంకట రామిరెడ్డి, నాయకులు నాగరాజు గౌడ్, మురళి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.